క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ



90వ వార్డు లక్ష్మీనగర్ -ఎఫ్‌బ్లాక్‌లో పింఛను అందజేస్తున్న వలంటీరు సత్య

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం మొదలైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను డబ్బులు అందజేశారు. సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వార్డు పరిధిలోని లక్ష్మీ నగర్ -ఎఫ్ బ్లాక్‌లో వలంటీర్లు సత్య ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లు అందజేశారు. అదే విధంగా పింఛనుకు అర్హత ఉన్న వారి వివరాలను సేకరించి, సచివాలయంలో వారి సమాచారాన్ని అందజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛను డబ్బులు అందించేలా వలంటీర్లు తగిన శ్రద్ధ తీసుకున్నారు. ఒకటో తారీఖునే ఇంటికొచ్చి తంధన్‌గా పింఛను డబ్బులు అందజేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆ స్థలంలో మార్కెట్ సముదాయం వద్దు



మల్కాపురం మార్కెట్ వ్యూ

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామం నడిబొడ్డున విలువైన స్థలంలో మార్కెట్ సముదాయాన్ని నిర్మించవద్దని పలు కుల సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఓ సమాశంలో వీరంతా మార్కెట్ సముదాయం ఏర్పాటును వ్యతిరేకించారు. ఇంత విలువైన గ్రామ కంఠం స్థలం జీవీఎంసీ ఆధీనంలోకి వెళ్తుందని, ఇంత విలువైన స్థలాన్ని 80 ఏళ్ల నుంచి కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. ఇప్పుడు జీవీఎంసీకి స్వాధీనం చేసుకుంటే ఇక గ్రామాభివృద్ధికి నిధులు ఎలా సమకూరుతాయని ప్రశ్నించారు. హెచ్‌పీసీఎల్, కోరమాండల్ తదితర పరిశ్రమల నుంచి సీఎస్‌ఆర్ నిధులను సేకరించి, ఆ నిధులతో ఇక్కడ సముదాయాలను నిర్మించాలని వారంతా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఈ సందర్భంగా కోరారు.

వాహనాల తనిఖీ

మల్కాపురం : మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ముఖ్య కూడలిలో మల్కాపురం క్రైమ్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీలు చేశారు. శుక్రవారం రాత్రి మల్కాపురం, శ్రీహరిపురంలో క్రైమ్ ఎస్‌ఐ ప్రసాద్‌రావు ఇతర సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.

సామూహిక గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు



ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: టిడ్కో ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇక్కడి ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. సత్యనారాయణ వ్రతాలు నిర్వహించే ప్రాంగణం అందరికీ అనువుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి స్టేజిపై కొన్ని కుటుంబాలు వ్రతాలు చేసే విధంగా అలాగే దిగువన మరి కొన్నికుటుంబాలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే భోజనాలకు కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు. తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ ఆ ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, పార్టీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

మనసున్న మారాజు..మా ఆనంద్

- సొంతడబ్బులతో పింఛన్ల పంపిణీ
- అర్హులైతే ప్రభుత్వ పరంగా మంజూరు
- నియోజకవర్గంలో 215 మందికి పింఛను అందజేత
- పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఆనంద్ కుమార్



90వ వార్డులో తన సొంత నిధులతో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్



వెంకటాపురంలో తన సొంత నిధులతో పెన్షన్ అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

విశాఖ విద్య: అవ్వా-తాతల కళ్లల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సామాజిక పింఛన్లు ఠంచన్‌గా ఒకటో తేదీనే లబ్ధిదారులకు అందిస్తోంది. రాజకీయాలకు అతీతంగా అర్హతే కొలమానంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అయితే అనివార్య కారణాలతో పింఛను డబ్బులు అందని వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతినిధిగా నేనున్నానంటూ వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ తన సొంత డబ్బులను పింఛను రూపంలో అందిస్తూ తన పెద్ద మనసును చాటుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చినట్లే, ఠంచన్‌గా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటికి వెళ్లి, పింఛను డబ్బులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా 215 మందికి పింఛన్లు అందించారు. దీనికి కొనసాగింపుగా శుక్రవారం 90 వార్డులో 15 మంది, 91వ వార్డులో 15 మంది, 92వ వార్డులో 10 మందికి శుక్రవారం పింఛను డబ్బులు అందించారు. కొంతమంది ఇళ్లకు ఆయనే నేరుగా వెళ్లి డబ్బులు అందజేశారు. చిన్న కారణాలు, తగిన ధ్రువపత్రాలు లేనందుకు ప్రభుత్వ పెన్షన్లు అందని విషయంపై ఇప్పటికే ఆడారి ఆనంద్‌కుమార్ జిల్లా అధికారులతో మాట్లాడారు. వారికి పెన్షన్లు మంజూరయ్యేంత వరకు తన సొంత నిధులతో సాయం చేస్తున్నట్టు చెప్పారు.

అర్హులందరికీ పింఛను మంజూరు

సొంత డబ్బులతో సాయం చేస్తూనే ప్రభుత్వ పరంగా పెన్షన్లు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కొంతమంది వృద్ధులు విన్నపం మేరకు పింఛన్లు మంజూరుపై శుక్రవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వపరంగా పెన్షన్లు వచ్చేంతవరకు యథావిధిగా తన సొంత నిధులతో పెన్షన్లు అందజేస్తానని ఆనంద్ చెప్పారు.

పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు



తన భర్తకు వచ్చే పింఛను డబ్బులు ఆగిపోయాయి. ఈ విషయాన్ని వలంటీర్లకు చెబితే, ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. పింఛను మంజూరు చేయిస్తానని ఆనంద్ కుమార్ మాట ఇచ్చారు. అంతే కాకుండా పెద్ద కొడుకులా మాకు నెలకు రూ.3 వేలు చొప్పున తన సొంత డబ్బులు సాయం చేస్తున్నారు. ఆయన రుణం తీర్చుకుంటాం.

–రాములమ్మ, ఏపీఎస్‌ఈబీ కాలనీ

కుటుంబానికి అండగా..



నా భర్తకు అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో పింఛను వచ్చేది. అది కొన్ని నెలలుగా రావడం లేదు. కాగితాలేవో తప్పు పడ్డాయట. దీన్ని మా వలంటీరుకు చెబితే, మా కష్టం గురించి ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. మా పింఛను మంజూరు గురించి ఆనంద్ కుమార్ అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం మాకు ఆర్థిక సాయం కూడా చేస్తున్నారు.

– పునీత్రం సాహూ, లక్ష్మీ నగర్ -ఎఫ్ బ్లాక్

కష్టమని చెబితే సాయమందించారు



నా భర్తకు ఆరోగ్యం బాగుండదు. పింఛను కోసమని దరఖాస్తు చేసుకుంటే, కులం సర్టిఫికెట్ లేదని మంజూరు చేయలేదు. మేము కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మా కష్టాన్ని వలంటీరు ద్వారా ఆడారి ఆనంద్ కుమార్‌కు చెప్పుకున్నాం. మాకు పింఛను మంజూరు చేయిస్తానని ఆనంద్ కుమార్ మాట ఇచ్చి, సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. ఆర్థిక సాయం కూడా చేస్తున్నారు.

– సురేందర్ సాహూ, లక్ష్మీనగర్

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి..!



మాట్లాడుతున్న ఆనంద్ కుమార్



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న ఆనంద్ కుమార్

- అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తా
- 18 నెలల్లో రూ.100 కోట్లతో పనులు
- ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ సేవ చేస్తా
- పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆనంద్ కుమార్

విశాఖ విద్య: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే, అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు గవర వీధిలో రూ.15.17 లక్షలతో నూతనంగా నిర్మించిన గౌరీ సామాజిక భవనం మొదటి అంతస్తును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయాల సాధన దిశగానే, పదవీ వ్యామోహం కాకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆశీసులతో నియోజకవర్గ సమన్వయకర్తగా ఈ 18 నెలల కాలంలోనే రూ.100 కోట్లతో తన హయాంలో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాలను సకాలంలో వారి చెంతకు చేర్చేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సేవా భావంతో ఇప్పటికే విశాఖ డెయిరీ ద్వారా అనేక మందికి తోచిన రీతిలో సేవ చేస్తున్నానని, ఎమ్మెల్యేగా ఉంటే, వీటిని మరింత విస్తరించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో అందరికీ సంక్షేమ ఫలాలను ఇంటికి చేర్చేలా తన వంతు కృషి చేస్తానన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నమ్మి శ్రీను ,చక్కా ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జీవీఎంసీ 8వ జోన్ ఏఈ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లపు వెంకటేశ్వరరావు ,ఆడారి శ్రీను, ఎం. సత్య, వినీత, బోర అప్పల రెడ్డి, దొడ్డి కిరణ్, దొడ్డి సతీష్, కార్పొరేటర్లు ,స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక

విశాఖ విద్య: జీవీఎంసీ పరిధిలోని పాఠశాలల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేశారు. నగరంలోని అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీ జీవీఎంసీ పాఠశాలలో ఎన్‌సీసీ ప్రథమ శ్రేణి ఉన్నత అధికారి ఎంఎస్. విశ్వనాథం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.

2024–26 సంవత్సరానికి ఆర్మీ ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా దీనిని చేపట్టారు. ఆంధ్ర ఆర్టిలరీ ఎన్‌సీసీలో 11 మంది జూనియర్ డివిజన్ విద్యార్థులు రెండో సంవత్సరానికి అవకాశం లభించటంతో, కొత్తగా 24 మందికి అవకాశం కల్పించారు. పాఠశాలలో 7,8 తరగతులు చదువుతున్న సుమారు 200 మంది ఉత్సాహవంతులైన విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 14 విద్యార్థినులు జూనియర్ వింగ్‌గా, 10 అబ్బాయిలను జూనియర్ డివిజన్‌గా ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. లక్ష్మీనరస, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్ కుమార్, సుబేదార్ మేజర్ సజీవన్, హవల్దార్లు శుక్ర , శ్యామల రావ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు



ఆడారి ఆనంద్ కుమార్‌ను సత్కరిస్తున్న వలంటీర్లు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో రహదారి పనులకు వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన తరువాత సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ 8.91లక్షలు వెచ్చిస్తున్నామని తెలిపారు. ఈ పనులు సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌ను సత్కరించిన వలంటీర్లు

ఆడారి ఆనంద్ కుమార్‌ను స్థానిక వలంటీర్లు సత్కరించారు. వారికి సేవామిత్ర అవార్డు వచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వలంటీర్లే బలమన్నారు. వారి సంక్షేమం కోసం సీఎం జగన్ పరితపిస్తున్నారని చెప్పారు.

కార్పొరేటర్ లక్ష్మణరావుకు పరామర్శ



కార్పొరేటర్ లక్ష్మణరావును పరామర్శిస్తున్న ఆనంద్‌కుమార్

సింథియా : అనారోగ్యానికి గురైన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావును శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని కార్పొరేటర్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గొరపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెందుర్తి: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెందుర్తి మండలం గొరపల్లిలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సచివాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేవతి

విశాఖ విద్య: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంతా సమన్వయంతో పని చేయాలని జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతి అన్నారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో వ్యాక్సినేషన్‌పై అంతా సిద్ధం చేసే క్రమంలో శుక్రవారం యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడుతూ యూపీహెచ్‌సీ పరిధిలో 0–5 సంవత్సరాల పిల్లలు అందరికీ పోలియో చుక్కల మందు వేసేందుకు 8 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 8,705 ఇళ్లలో 2,690 మంది పిల్లలకు పోలియో చుక్కల ముందు వేయాలనే అంచనాతో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి రోజు ఎంపిక చేసిన బూత్‌లో పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆ తరువాత రెండు రోజుల్లో ప్రతీ ఇంటినీ సందర్శించి ఏ ఒక్కరూ మిగలకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు పిల్లలందరికీ చుక్కలు ముందు వేయాల్సి ఉందన్నారు. ఇందుకోసమని వైద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వలంటీర్లతో కూడిన 32 టీమ్‌లను నియమించడం జరిగిందన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లకుప్రశంసా పత్రాలను అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింథియా: ప్రభుత్వ వారధులుగా ఉన్న వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రశంసించారు. జీవీఎంసీ 63వ వార్డులో ప్రభుత్వ పురస్కారాలను పొందిన వలంటీర్లను ఆయన సత్కరించారు. వార్డు వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడూలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసే ప్రతి మంచి పని, ప్రతి సంక్షేమం వలంటీర్ల ద్వారానే జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాల వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు కలిదిండి భద్రీనాథ్, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్, నాగభూషణం, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధిక సంఖ్యలో వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని అందుకోసం ప్రతీ కార్యకర్త, బూత్ లెవల్ కమిటీ సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో శుక్రవారం 92వ వార్డు ముఖ్యనాయకులు, బూత్ లెవల్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నుకున్న నాయకుడు ఈ ఐదేళ్లలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనుల ముందు ఫొటోలు తీసుకుని పోజులిచ్చాడన్నారు. పదవులు లేకపోయినా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈసారి పనిచేసే నాయకుడ్నే ఎన్నుకునేందుకు ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. అర్హత గల ప్రతీ కుటుంబం ఏవిధంగా లబ్ధి పొందిందో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : స్వాతి నక్షత్రంను పురస్కరించుకుని సింహగిరిపై శుక్రవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది.లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.దీనిలో భాగంగా ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణమండపంలో హోమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద వేంజేంపజేశారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై వేంజేంపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారన చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్ని కార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై జల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు చక్రవర్తి, చిన్నా తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా శిఖర యంత్ర త్రిరాత్రి ఉత్సవాలు



యాగం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో సంపత్ వినాయక పూర్వక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత కోదండ రామాలయ శిఖ యంత్ర మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణ నడుమ గోధూళి వేళలో విఘ్నేశ్వరపూజ, అఖండ దీపారాధన, దీక్షాకంకణధారణ, యాగశాల ప్రవేశం చేశారు. గ్రామంలోని పలువురు దంపతులు హోమ క్రతువులో పాలుపంచుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఆలయ శిఖర యంత్రాలకు పూర్ణకలశాలతో భక్తులతో జలాధివాసం జరుగుతోంది. అగ్ని ప్రతిష్ట చేస్తారు. సాయంత్రం 4.15 గంటలకు విగ్రహాలకు క్షీరాధివాసం, ధాన్యధివాసం, లష్టదిక్‌బలి, పంచశయ్యాదివాసం జరిపి మంగళ హారతులిస్తారు. ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ట వేదమంత్రోచ్ఛరణలు చేయనున్నారు. మధ్యాహ్నం రామాలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం కోలాటాలు, గరిడీలు, మేళతాళాలు, తప్పెటగుళ్లు, మందుగుండు సామాగ్రి నడుమ సీతారాముల పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు చెక్కుఅందజేస్తున్న దాత

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని సీతంపేటకి చెందిన కరణం వెంకటేశ్వరరావు రూ1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరుపున దాతకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి వేదికపై వేంజేపంచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.